# లజ్జా కిరీటధారిణి

కళాప్రపూర్ణ

డా. ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ

లజ్జాకిరీటధారిణి
ప్రతులు 1000

సర్వస్వామ్యములు
కవయిత్రివి.

మూల్యము:-
ఎనిమిది రూపాయలు.

ముద్రణ:
మాతృశ్రీ ప్రింటర్స్, బాపట్ల.

లాభస్థానము
డా. ఘంటసాల లక్ష్మీకాన్తమ్మ,
బాపట్ల.

# విషయ విన్యాసము


| | | |
|---|---|---|
| 1. | ఆంధ్ర భారతి. | 1 |
| 2. | వానవీస్తవము. | 2 |
| 3. | మొల్ల ఆత్మనివేదనము. | 3 |
| 4. | మాతృశ్రీ కస్తూరిబా. | 9 |
| 5. | పూజ్యబాపూజీ. | 12 |
| 6. | రణసూక్తము. | 15 |
| 7. | అమ్మ. | 18 |
| 8. | గదాధరుని విద్యాభ్యాసము. | 21 |
| 9. | గదుని క్రీడాభిలాష. | 27 |
| 10. | శారదాదేవి యౌవనము. | 29 |
| 11. | భావదేవస్తుతి. | 34 |
| 12. | లజ్జాకిరీటధారిణి. | 35 |
| 13. | దుర్గాసంప్రార్థనము. | 36 |
| 14. | దివ్యదర్శనము. | 37 |
| 15. | ఆంధ్రనాయకరత్నము. | 38 |
| 16. | కామకోటి పీఠాధిపతి. | 39 |
| 17. | రాధాకృష్ణోవిరాజతే. | 40 |
| 18. | బాలమురళీ కృష్ణాభి నందనము. | 42 |
| 19. | పరిమితమౌ జనాభా. | 43 |
| 20. | పరాక్రమించి మించువారు భారతీయ సైనికుల్. | 45 |
| 21. | కవయిత్రి మొల్ల. | 46 |
| 22. | కవయిత్రి మొల్ల. | 47 |
| 23. | మొల్ల. | 49 |
| 24. | కవయిత్రి రంగాజమ్మ. | 50 |
| 25. | ఇంతుల శౌర్యరసేష్టి. | 51 |

## నా కవితాభ్యాసము: —

మధురకవి నాళము కృష్ణరాయుల బిడ్డనగుట, చిన్ననాట నుండియు ఏదేని యొక రచన యొనర్చుట నాకు సహజమైన అభ్యాసమై పోయినది.

శ్రీ నాయనగారు గీత సరస్వతిని సమర్చనచేసిన మహాకవులు, నాకుమాత్రము అదియేలకో బాల్యమునుండియు వచనరచన యనిన నభిమానమెక్కువగా నుండెడిది. ఆ అభ్యాసముచేతనే నా పండ్రెండవ యేటినుండియు వ్యాసములు వ్రాయుట, వ్రాసినవానిలో కొన్నింటిని అప్పుడప్పుడు భారతి ప్రబుద్ధాంధ్ర, గృహలక్ష్మి ఆంధ్రపత్రిక మున్నగు పత్రికలయందు ప్రచురించుట జరుగుచుండెడిది.

కాలక్రమమున పద్యరచనము చేయవలెనని అభిలాషపడి, ఆయభిలాషతో రచించిన కావ్యఖండములనే ప్రస్తుతము 'లజ్జాకిరీటధారిణి' యను మకుటమున ప్రచురించితిని.

భారత మహిళ యెప్పుడును లజ్జాకిరీటధారిణియే, ఆ వినమ్రశీలతయే భారతజాతికి కిరీటమై ఈ జాతి కౌన్నత్యము గూర్చినది. భారతీయుల విజ్ఞానమెంత యపారము, ఆదర్శప్రాయమునై యలరారి యున్నదో, అంత లజ్జారుణ రుచిరముగుటకు భారతీయుల గృహస్థజీవన పద్ధతి కాధారభూతమైన, నవవధువుయొక్క నవజీవనప్రాదుర్భావ మధురమైన హృదయరక్తిమకారణమై యింపెసలారుచున్నది.

మొగ్గలుదొడుగు నునుసిగ్గు దొంతరలతో, ప్రఫుల్లయై, జగతి యందలి జనజీవనవికాసమునకు ఆదికారణమగుచు, మల్లియల పరువమ్మునుబోలు హృదయ సౌందర్యముతో ఆనందవిపంచీమంజులారవము లను కదలనిండించు స్నిగ్ధసుందరి; ఆ లజ్జాకిరీటధారిణియగు భారత పురంధ్రి! ఆమెయొక్క పవిత్రశీల్యము; అదభ్రశుభ్రమైనది!

ఈ సౌశీల్యమే జగతికి రక్షయగునని విశ్వసించినదాననగుటచే, అట్టి పుణ్యసతులైన, మొల్ల, ఝాన్సీలక్ష్మీబాయి, ఇంకను రుద్రమ్మ, అహల్య, కస్తూరిబా, కణ్ణగి, కన్యక, సరోజినీదేవి మున్నగు ఉత్తమ వ్రతురాండ్రైన పరమ సాధ్వులను గూర్చి ప్రస్తవ మొనరించిన ఈ ఖండకావ్యమునకు నేను 'లజ్జా కిరీట ధారిణి' యను నామ ముంచితిని.

నన్ను తన తనయగ భావించి సంతత సమాదరణ భావముతో నాకు శుభాశిషములొసంగి నా భవిష్యత్తు నుజ్వలమొనర్చు పూజ్య పాదులు, మహానుభావులు, సాధుశీలురు! కళాప్రపూర్ణులు, తెలుగులెంక, శ్రీ తుమ్మల సీతారామమూర్తి గురుదేవులు! వారు ఈ కావ్యమునకు ప్రశంసా పూర్వమగు నాశిషములొసంగుట నిక్కముగా నా భాగ్య పరమావధి! వారికి నా నమోవాకములు!

నాయందాదరముంచి కావ్య స్వీకారమున కామోదించిన సోదరులు శ్రీ దేవులపల్లి రామానుజరావుగారికి కైమోడ్పులు.

సుందరముగా ముద్రించి యిచ్చిన భావపురి మాతృశ్రీ ప్రింటర్సు వారికి నా ధన్యవాదములు.

కావ్యగుణమును పరిశీలించి సమాదరింపు డని విజ్ఞానవిలస న్మూర్తులగు నాంధ్ర ప్రజానీకమునకు కైమోడ్పుతో విన్నప మొన రించు చున్నాను.

కళాప్రపూర్ణ

**డా. ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ**

# ప్రశంస

కలదు ప్రతిభ, లెస్సకలదు వైదుష్యంబు
కలదు మొక్కవోని పలుకుబడియు
కలదు కలదు లక్ష్మీకాంతమ్మకు రసజ్ఞ
జాతి కింపు గూర్చు కైతచదురు.

తన విశిష్టవిభూతుల వనితవాణి
యొక్కఁ డని చాటె మున్ను యదూద్వహుండు
సైరణకుఁ బుట్టినిల్లగు నారినుడికి
మానవుఁడె కాదు పాషాణమైనఁగరఁగు.

నన్నపాచార్యునుడిలోని నవకమెఱిఁగి
బడలి తిక్కన్న నుడిలోని పలుకునేర్చి
యీ కవీమణి పుట్టినయింటి జిగికి
మెట్టినింటి వన్నియకును మెఱుఁగువెట్టె.

కవితయందె కాదు కమనీయసంస్కృతి
రక్షయందు గానదీక్షయందు
బహుముఖప్రసంగ వరిపాటియందు దీమె
వీనుమిగిలె నాంధ్రవిశ్వమునను.

మామిడిగున్నమీఁద మునిమాపులఁ గోయిల క్రోల్చులీల నీ
లేమ సభావితర్ది నవలేపవిదూరమ్మృదూక్తు లాడుచో
జాములు జాములేగు నిముసమ్ములుపోలె సదస్యకోటి, కే
బాములు సైఁచి సల్పిన తపంబిటు పండెనొ యాటుకూరికిన్.

ఈ కావ్యఖండతతి వా
ణీకంఠమనోజ్ఞహారనిచయమ్ముకదా!
యేకృతినిగన్న ధర్మ
శ్రీ, కవితా వైభవమ్ము చిందులు ద్రొక్కు;

రాముఁడున్నాఁడు జానకీరామకలదు
పల్లవించిన పుణ్యంబు మొల్లకలదు.
అమ్మ కస్తూరికలదు మహర్షి గాంధి
కలఁడు కవితాసమీచీనకళలనిందు.

పిఱికివాఱిన జాతికి బిగువు బీర
మలవరించి రణక్షోణి కరుగు తెగువ
గఱపు క్రొవ్వేఁడి పల్కులీకవితఁగలవు
ఝాన్సిలక్ష్మిగ నీలక్ష్మి చాటె వాని.

అమ్మ వాత్సల్యమూర్తిగా నఖిలశక్తి
దాత్రిగా క్షమాశ్రయముగా ధర్మమునకు
రూపుగాఁ దోఁచునట్లు నేరుపులు గుల్క
నుగ్గడించిన యీచెల్లి పగ్గెమెత్తు.

పసితనమ్మునందె పరమహంసగ మాఱి
జగముకన్ను విప్పఁజాలినట్టి
రామకృష్ణుఁ గనుఁడు రమణీయ వాణిలోఁ
బలికె నీ సెలంత భవ్యకృతిగ

శారదాదేవి తన మేలిజవ్వనంబు
పతివిరాగమఖాగ్ని కాహుతి యొనర్చి
ధన్యతారాశి యగుట నుదాత్తకవన
ధోరణిం జెప్ప నీసెలందుకకె చెల్లు.

కత్తికోఁతలతోఁగాదు చిత్తతురగ
నిగ్రహముతో మితాపత్యనియతి నేర్చి
మన సనాతన ధర్మమున్ మనుపుఁడన్న
లక్ష్మివల్కులి నార్షధీలాస్యమెసఁగు.

కవయిత్రీమండలమున
కవిరళ గౌరవమునిడుచు నాయుస్సుఖ పై
భవముల నీసోదరి నవ
నవకవితాసృష్టి సమభినందిత యగుతన్ !

ఎంతనేర్చిన నేవో కొలంతలుండుఁ
గాన, నిత్య విద్యార్థినికరణి, వాణి
దయగడించుచు లక్ష్మికాంతమ తెలుంగు
జాతినలరించుఁగాత విఖ్యాత కృతుల.

'తెలుఁగులెంక'

**తుమ్మల సీతారామమూర్తి**

# సాహిత్య జ్యోతి

## సోదరులు శ్రీరామానుజరావుగారు

ఆబాల్యంనుండీ, సేవాపరతంత్ర చిద్విలాసమూర్తిగా, సౌజన్య దీప్తిగా, సాహిత్యజ్యోతిగా, బ్రదుకును పరిమళింప జేసుకొన్న శ్రీ రామానుజరావుగారు, నాకు ఆప్తసోదరులుగావడం నా అదృష్ట విశేషంగా భావిస్తాను. వారి విశిష్టమైన తన్యసంస్కారాన్ని సంభావిస్తాను!

పాలిత ప్రజల జీవితాలలో నిప్పులు గ్రుమ్మరించి, తన రాజ్యాన్ని ఒక అగ్నిపర్వతంగా రూపొందించిన నిజాము పరిపాలనను ఎదురించ డంలో, ఎంత సాహసం ప్రదర్శించారో, "ఆంధ్రజాతి సర్వతోముఖాభి వృద్ధిని దృష్టిలో వుంచుకొని, ఆంధ్రనాయకులు- ఏ ప్రాంతమువారైనను బద్ధకంకణులై, కృషిచేసి, ఆంధ్ర రాష్ట్రమును సమగ్రమును గావించ, విశాలాంధ్ర సాధనకు దీక్షవహించవలసియున్న" దనే శంఖారావాన్ని పూరించి, తెలంగాణాతో కూడిన సమగ్రాంధ్రరాష్ట్రస్థాపనకై అంత దీక్షతో ప్రయత్నించిన నాయకోత్తముడు, శ్రీ రామానుజరావుగారు!

ఇంత పటిష్ఠమైన జాతీయ భావనోద్రేకమూ, సంఘసేవానురక్తి తోబాటు, వారి హృదంతరము నుండి పెల్లుబికి వెల్లువయై ప్రవహించి ఆంధ్ర సాహిత్య కేదారాలకు ఏతాములెత్తించి పండింప జేసిన బహుముఖ కావ్యసవ్యపరంపరను సాహిత్యఎకాడమీ గాదులకు ఎత్తించిన ప్రగాఢ సాహిత్యాభిమానము కూడా వారి సొత్తే అని చెప్పకోకపోతే, ఈనాటి సాహితీవ్రతులు కృతఘ్నులే ఔతారు!

వారితో సంబంధము లేని, వారి సహాయము పొందని సాహిత్య సంస్థ అంటూ ఈనాడు ఆంధ్రదేశంలో లేదు.

ఉస్మానియావిశ్వవిద్యాలయంలో అనేక పదవులను నిర్వ హించారు. కొంతకాలం వైస్‌ఛాన్స్‌లరుగా కూడా వ్యవహరించారు.

ప్రభుత్వ విద్యా సలహాసంఘంలో కేంద్ర పాఠ్యపుస్తకసంఘంలో, ఆలిండియారేడియో సలహాసంఘంలో, కేంద్రసాహిత్యఎకాడమీలో రాజ్య సభ సాహిత్యప్రతినిధిత్వప్రతిపత్తిలో, సాహిత్య ఎకాడమీ ప్రధాన కార్య దర్శి పదవిలో, సారస్వతపరిషత్తు ప్రధాననాయకత్వంలో ఒకటేమిటి, ఇంకా అనేక అసంఖ్యాకరంగాలలో వారి సాహిత్యసేవ, పూచి, పూచి, ఫలించి ఆంధ్ర దేశాన్ని అవ్యాఘాతవ్యాఘానంద సాహిత్యమూర్తిగా సమలం కృతం చేసింది.

అంతేకాదు ఎప్పుడూ వాడని కవితాసుమాల వచ్చతోరణావళు లతో సాహిత్యరంగము నుద్దీప్తముచేసిన సాహిత్యజ్యోతివారు! దీనికి వారి అసంఖ్యాక రచనలే నిదర్శనము!

వారి యందలి ఈ తీవ్రసాహిత్యసేవాభినివేశం కంటె హెచ్చుగా నాకునచ్చింది; వారి ప్రాచీనసంస్కృత్యభిమానావేశం; "ప్రాచీన సంస్కృతిలోని ఉదాత్తతను కాలానుగుణంగా మలచుకోవాలని, ఆ నిగ్గును రక్షించుకోవాలనీ కోరేవారిలో నేనొకణ్ణి, ప్రాచీనతతో సంబంధం ఉండాలనేవాణ్ణి. భారతీయ సంస్కృతిలో విశ్వజనీనత ఉంది. దానినే మనం రక్షించుకోవాలి. ఆ విశ్వజనీనతే మన సంస్కృతిని శాశ్వతం చేస్తున్న"దని ఒకప్పుడు వెలువరించినవారి యీ యభిప్రాయంతో నిర్వి వాదంగా సమశ్రుతిని పవరించే సమచైతన్య సంస్కారం కలదానను; నేనుకూడా!

సుమారు ముప్పది నలుబది సంవత్సరాలనుండీ, శాఖోపశాఖ లుగా విస్తరించిన, సాహిత్యఎకాడమీ కార్యదర్శి పదవీసేవానిర్వహణ రూపమైన చల్లని చలువపందిళ్ళలో సాహితీయాత్రతులకు దప్పికలు దీర్చి, నిలువనీడలిచ్చిన, సోదరుల ఆశయసౌజన్యంతో పరిచయం కల్గిన నాకు చిన్న సోదరిగా వారికి ఒక నా కావ్యాన్ని అంకితమియ్యాలనే చిన్న అభిలాష కల్గింది! సోదరులు శ్రీరామానుజరావుగారు ఈ నా కోరికను కాదని త్రోసివేయక సౌహృదయ్యంతో అంగీకరించారు! వారి యీ ఆమోదానికి ధన్యవాదాలు.

నా యీ కావ్యకన్య, సోదరులకు చిన్ని మేనకోడలు! అంత కంటెకూడా సన్నిహితత్వాన్ని సంతరించుకోవాలంటె పుత్రీసమాన!

ఈ కన్య భారతీయువనితలకు అలంకారమైన లజ్జాకిరీటాన్ని వహించి 'లజ్జాకిరీటధారిణి' అనే సార్థకనామాన్ని ధరించిన ముగ్ధ!

బహువిశ్రుతకీర్తిమూర్ధన్యులు, సౌజన్యాలంకారసమ్మానిత జీవన ధన్యులూ, అయిన శ్రీరామానుజరావుగారి ఒడిలో ఈ బాల భవితవ్యాన్ని సౌభద్రభద్రంగా భావిస్తూ పరమానందంతో ఈ పసిపాపనువారి విశాల హృదయమందిరాంగణంలో చిఱుగజ్జెల అందెల రవళితో తన క్రీడా రంగాన్ని విస్తరింప జేసుకొనే భాగ్యామృతకైశోర స్వరూపిణిగా భావిస్తున్నాను.

# కృతి సమర్పణము

ఏవంవిధశుభఘృణికిని
భావుకునకు వరవివేకభాస్వన్మణికిన్
దేవులపల్లి రామానుజ
కోవిదునకు కావ్యమిత్రు కోమలగుణికిన్.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమువారి
ఆదరమునకు ధన్యవాదములు.

— డా. ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ.

# లజ్జాకిరీటధారిణి

## ఆంధ్రభారతి

ఏ భాష నొకమాట హేలగా బల్కిన
వాణీమంజీర నిక్వాణమొలయు
ఏ వాణి గీతికాఋుతు లంచితశ్రుతి
మహనీయ మౌ మధుమహతి యగును
ఏ వల్కు శౌర్యరసేష్టియై తనమాతృ
దేవిరక్షణకు నాదేశమొసగు
ఏ కావ్యగీతికాలోకము నన్నయ
త్యాగయకృతులకు రాగమొసగు
సర్వరసభావసౌష్ఠవపర్వమగుచు
తెలుగుజనముల పున్నెమై వెలసెనేది
దేశభాషల లెస్సయౌ, బాసయేది,
అట్టి ఆంధ్రభాషాయోష కంజలింతు.

## వాసవీ స్తవము

ఎందఱో జన్మించిరి మఱి
యెందఱొ క్రుమ్మరిరి ధరణిని నిర్దచరిత్ర
న్నందఱిలో పేర్గాంచితి
వందనమిదె గైకొనగదె వాసవి జననీ॥

వందితయైనది భారతి
సుందరమౌ నీదు త్యాగశోభావిభవ
స్పందనమందుట నహహా
వందనమిదె గైకొనగదె వాసవి జననీ॥

కుందనమువంటిమేను వ
మందాత్మత్యాగశీలమహిమాన్వితవై
చందముగ నగ్నికొసగితి
వందనమిదె గైకొనగదె వాసవిజననీ॥

మహిళాజనపావన ధర్మరతిన్
మహముంబొనరించితి జీవితమున్
మహితంబగు నీవ్రతశోభయు ని
మ్మహి నద్భుతమౌ, మహనీయగుణా॥

వరాకుసేయకో భవాని భద్రమూర్తి వాసవీ
వరాత్పరీ, పరాంబికా స్వవైశ్య వంశపావనీ
మరాళగామినీ, మహేంద్రవందితా, మహేశ్వరీ
సురాసురార్చితాంఘ్రియుగ్మసుందరీ సుహాసినీ॥

వాసవీ జయమంగళంబిదె వాసిగాగొను ప్రేముడిన్
భాసమానను విగ్రహా వరభామినీకులపావనీ
ఆశలందున పావనాశయ యజ్ఞదీక్షను శీలసం
వాసితంబుగ నాంధ్రనారికి వైభవమ్మును గూర్చితే॥

ఓం తత్సత్.

# మొల్ల
## ఆత్మనివేదనము

నా తండ్రి రఘురాజనందన ఈ దీను
రాలి దయాదృష్టి నేలుటగద !
ఎన్ని పుట్టుల దాచుకొన్న పున్నెపు వంట
ఒక్కసారిగనిట్లు దక్కెనయ్య !
కరగిపో, సీతమ్మ కన్నీటికథలు చి
న్నప్పుడే, అయ్య, తా జెప్పుట గద
కవితాసరస్వతీశ్రవణకల్హార మ
ధుపు గొంతున రవంత తొలికిరియిటుల
కలము పట్టించి పుట్టతేనెలు వెలార్చి
కవుల పరిపంక్తి నిలిపెను గాదెనన్ను
స్వామి వాత్సల్యమును తెల్గుజాతిలోని
స్వాదు కవితారసజ్ఞత జతపడంగ ॥

ధన్యనైతిని, ననుగన్న తల్లి భూమి
ధన్యయయ్యెను ! నీ చరితమును విన్న
ఆంధ్రజాతియె ధన్యమై యమరమయ్యె
పరమపావన శ్రీరామ ! భవ్యనామ !

చిలికిన సుధలై కర్ణపు
పలుకు గుబాళింపుగాగ ప్రభుని చరిత్రల్
పలుకవలెగాక చెవులకు
ములుకులు గానేల యన్యములు పలుకంగన్॥

చెప్పితినా, నేమ ! నీవై
చెప్పితివో ! లోన కొలువుసేయుచు రసముల్
చిప్పిల, నీగాథల రా
మప్పా, నాయెడల నెంత యభిమానమురా॥

దుష్టులను ద్రుంప, పాలింప శిష్టకోటి
సకలలోక కళ్యాణ కాంక్షను ధరిత్రి
నడుగువెట్టిన యాది విష్ణుడవునీవు
సర్వలోక మాన్యమగు నీ చరితమయ్య !
భువనమాత, పూతచరిత భూమిజాత
నీకుతోడుగభువిబుట్టె; నెనరుబెంప !
వనిత జానకితో బితృవాక్య నియతిఁ
బాలనము సేయుపూనిక బాసగొనుచు,
విడిచి రాజ్యమ్ము, కానకు వెడలి, కడకు
పడతి గోల్పోయి, పడరానిపాట్లుపడియు
ప్రథిత మానవాదర్శ జీవనపథమ్ము
లెల్ల జగతికి నీపావనేతిహాస
రూపమునచాటు ధర్మవీరుడవుతండ్రి !
వేదవేద్యుడవు ! సుధర్మ విగ్రహుడవు !
సర్వలోక శరణ్యుడౌ స్వామివీవు !
పతితపావన గుణధామ ! భవ్యనామ !
ఎవరు నిమ్ము గీర్తింపగా నవనిగలరు!
కలుషభారమ్ముతో ధాత్రి, కలగిక్రుంగు
సమయముల నీవు ధర్మసంస్థాపనమున
కెన్ని యవతారముల దాల్చి యేగుదెంచి
వాడవో! యెన్ని విధముల నవ్యబోధ
చేసినాడవో; సృష్టికి సేమమరసి !

అయిన నేమాయె తండ్రి! నే డవనిలోన
పెరిగి; యాసురభావమ్ము, పిచ్చటిల్లి.
వికృతకర్కశవిరళదంష్ట్రికలుసాచి
నగ్ననృత్యమ్ము సల్పుచు నవ్వుచుండె
నరులు మానవభావమ్ము మఱచి దాన
వత్వమునెకోరి స్వార్థులై పరగుచుండ్రు
ధనమునకు తాము దాసులై పెనగుచుండ్రు
నటనయే జీవపథముగ నడచుచుండ్రు
ఎవరొకారయ్య, మేమె దానవుల మగుచు
వేగిపోయి;పరస్పర ద్వేషవహ్ని!
తప్పి; సుఖశాంతులకును సోదరజిఘాంస
మతముపేరిటి ఛత్రమ్ము మాటుకొంటి
మా కళంకములెల్ల నీ కంటగట్టి!
కళల తెఱవెక్క దుర్వృత్తి కప్పుకొనుచు
మృగములవిధాన, సంఘాన మెలగుచుండి
స్వార్థవృత్తిని నొండొరు చంపుకొంచు
నిలను పీనుగుపెంట కావించినాము!
మేముసేయని అఘమంచు నేమికలదు?
అఘముసేసియు శాస్త్రోక్తమనుట సబబె?
ధర్మసౌభాగ్యమహితసుందరము, పరమ
పావనము, రామరాజ్యమన్ ప్రథితమగుచు
నీదురాజ్యము ప్రాజ్యమై వెగడెనయ్య!
మాది రామరాజ్యము చూడుమనుచు మేము
మురియుచుంటిమి అవినీతి పరులమగుచు!
ఇట్లుచూచుచు కిమ్మనవేమి! స్వామి!
మమ్ము శిక్షింపగా సమయమ్ము రాదొ!
విసిగి వేసారి యిట్టుల విడిచినావొ!

కుక్కతోకను వరిసేయు కుదురువడదొ!
'నాకు మీరిన దిది'యని యూకొనెదవొ
ఏల, యీ మౌనముద్ర! మమ్మేలుకొనగ!
జాలి గలుగదో, జాలముచాలు, చాలు
నొక్కసారి విచ్చేసి మముద్ధరింపు
నీలనీరదఘనతేజ, నిర్మలాత్మ
రమ్యగుణసాంద్ర! రఘుకుల రామచంద్ర!
మొరలు వినవయ్య ప్రార్థింతు మొల్ల నయ్య!

భువనమందార! త్రిభువన పుణ్యసార!
సకలనిగమాంత విహరణచరణ! కరుణ
నొక్కసారి కన్పింప గదోయి; కన్ను
దోయి, విచ్చి నన్ననుగాను మోయిస్వామి!

ఎన్ని భవములు గామోసులెత్తుచున్న
కాంక్షయో యిది, యాశ్రిత కల్పభూజ!
వచ్చి; చల్లని జాబిల్లి వలె, తపించు
నీక్షణచకోరముల దనియింపగదవె!

ఎన్నియుగముల కాంక్షయోయిదియు తండ్రి
నిన్నుగాంచగావలెనను నీప్సితమ్ము
ఎపుడు కాన్పింతువో, నన్ను నెపుడు ధన్య
రాలి గాజేసెదొ! యెఱుంగ రామచంద్ర!

బ్రిమకు దోయిలిబట్టి, నీ పాదపీఠి
వేచియుంటిని! నీకృపా బిందువునకు
తూగునే! యుర్విగల సర్వభోగములును
ఆలకింపుము నీ దాసురాలి మొఱల!

అమ్మా ! జానకి ! నాయీ
యిమ్మలి కమఃదీర్ప నీవయోపుదు, కడుసా
మమ్మున, నుపేక్ష తగదని
ముమ్మా రయ్యకు వచింపు మోపిక తోడన్ !

అహహ ? ఏమిది ! ఎంత మహాద్భుతమ్ము !
నీలమేఘము నాయెద నిండిక్రమ్మ
పార్శ్వమందున మెఱపులు పరిఢవిల్ల
సాగివచ్చెను చల్లగా చక్కనయ్య !

భక్తమానసబృందంబు పరిమళింప,
చల్లుచును దివ్యమాలికాసౌరభముల
కరుణకవతారమౌచు, దా కదలికదలి
అయ్య, రామయ్య వచ్చెనో అమ్మతోడ

నన్ను పాలింపగానిన్నినాళ్ల కిపుడు
మతికరగివచ్చి గడప ద్రొక్కితివి రయ్య
రమ్ము ! సీతమ్మ తల్లి ! పరాయినటవె
ఏమి యాతిథ్యమిత్తు మీ కెడదదక్క !

నడచి వచ్చితివే, రఘునాయకమణి
మహిని నవినీతి మావంగ మనసు కలిగి
ధర్మముద్ధరింపగ నీకు తలపుకల్గి
నాదు భాగ్యము రూపెత్తనాథ ! నాథ !
నడచి వచ్చితివే రఘునాయక మణి !

తమ్మని ఇంద్రనీలమణికాంతులు వాకలుగట్టి దిగ్దిగం
తమ్ములం, స్వామిభవ్యకరుణా తరుణాభ్రమనంగ భక్తులన్
సమ్మతి బ్రోవగా ప్రభుడు సాచిన హస్తమనంగ దైత్యవ
ర్గమ్ముల దర్పమార్పగ ధరాలునదూసిన ఖడ్గమోయనన్

మొల్లను రా! రామ ఇతర
మొల్లను రా, నీదుచరిత మొల్లల తావుల్
చల్లగ, మకరందము వెద
చల్లగ పాడితిని మనసు చల్లగ స్వామీ॥

రారా రాఘవ సంసృతి
పారావారము దరియుగ, భద్రము కలుగన్
మేరా; నీకరుణ గలుగ!
ఈరా, అభయమ్ము బెడఁదలెల్లఁ దొలంగన్॥

చిత్తము నీ కరుణాసుధ
జిత్తడి బొలమయ్యె, తండ్రి, శ్రీచరణమ్ముల్
హత్తుము! అచ్చోటను మొల
కెత్తుచు ధర్మద్రుమమ్ము ఇంపుఫలింపన్॥

# మాతృశ్రీ కస్తూరిబా

భారతనారీగర్వము
ధీరంబై పురులువిప్పి దిక్కులనాడెన్
సారంబౌ నీయునికిని!
గౌరవమింతులకు నీవు కస్తూరిమాతా॥

తలపులు ధర్మమార్గ మహితమ్ములు, పల్కినపల్కులన్నియున్
లలితములున్ సుధారస విలాసము లంచిత సత్యరూపముల్
విలసిలు శాంతియున్ దయయు, ప్రేమము నాకృతిగా రహింపగా
వెలసినతల్లి. దీనజనసేవధి, కస్తూరిబాయి గొల్చెదన్॥

క్షమయే యాకృతిదాల్చి యీ ధరణిలో కస్తూరిగాఁగాలెబో
రమణీయంబగు శీలసంపద యుదారంబయ్యె నీరూపునన్
క్రమశిక్షాయుత జీవితంబదియు విఖ్యాతంబు నీప్రాపునన్
ప్రమదామండలి కొజ్జబంతివిగదా రామామణీ కస్తూరి॥

చదువులు లేకపోయినను సద్గుణభూషణవౌచు పెద్దగా
చదివినయట్టివారికిని చక్కనివర్తనమెల్ల నేర్పు, నే
ర్పొదవిన దానవంచు సకలోర్విజనమ్ములు నీకు జోతవె
ట్టిదరుగదమ్మ, నీనడవడింగని, కస్తూరిబాయి గాంధిరో॥

పతియే దైవమటంచు డెందమున సంభావించి యశ్రాంతమున్
పతితో కష్టపరంపరల్ గుడుచుటే భాగ్యమ్ముగాసెంచి, భా
రతనారీమణులందు, మేటియనగా రాజిల్లు కస్తూరిబా!
మతియింపందగవే త్వదీయగుణముల్ నోరారగా భూప్రజల్॥

మందుగగో్రిల తప్పనరు మాంసరసమ్మునను విఙ్జలంచు నీ
కెందఱు చెప్పినన్ వినక, "యించుక యాయువుగల్గి యున్నచో
మందగు నీశ్వరుం"డనుచు మాంసము ముట్టక నీధుసత్త్వమున్
ముందిడి నిల్చినావు జనముల్ కొనియాడగ నిమ్మగాంధిబా"

కల్లయు కపటము నెఱుగని
యిల్లా లెవరనిన నీవెయే యని భువిలో
నెల్లరు జెప్పగ నొప్పెడు
తల్లివి; కస్తూరిబా, సుధామయహృదయా॥

నీదు వ్యాధి మాన్ప నీవు మానగ దాను
నువ్వు పప్పు తినుట లుజ్జగించె
నీదు భర్త! కల్గునే యిట్టి ప్రేమము
అన్యులందు, జగము లందునెందు!

భర్తతోడ కలిసి స్వాతంత్ర్య సమరాన
యోధురాలవగుచు మతికినావు
కలసి భర్తతోడ, కస్తూరిబా గాంధి!
గడపినావు బందిఖాన బ్రతుకు!

ఆదర్శమహిళవై, సం
పాదించితివమ్మ నీ వపార...శమ్ముల్
శ్రీదయితస్మరణన్, సం
పాదించితివమ్మ నీవు భద్రపదమ్మున్॥

ఓరిమితో సేవించితి
ధీరుని, నిష్ఠాగరిష్ఠు, దివ్యుని. పతి, నీ
యోరిమి, మహాత్ము జేసెను
స్ఫారయశుని. గాంధి కర్మచంద్రుని తల్లీ!

కల్లోల సాగర గర్భాన వయనించు
చల్లనినౌక నీ సాధు వృత్తి
పాషాణమయశై లవం క్తిని ప్రవహించు
చిఱుసెలయేఱు నీ చిత్తశాంతి
ప్రళయఝంఝూరటత్ప్రవనాన వినిపించు
మంజులగీతి నీ మాన్యచరిత
కఠిన శిలాతతిన్ గరువాన వికసించు
సన్నజాజియగు నీ చలువ మనసు
నియమవరతం త్రుడౌ పతినీడ నీదు
మనికి, మధుర గంభీరమై వినుతికెక్కె
అమ్మ, కస్తూరి. నుతియింప నలవియౌనె?
తల్లి, భరతాంబ నిన్గని ధన్యయయ్యె॥

# పూజ్య బాపూజీ

దుర్భరపారతంత్ర్యఘనదుర్దినకర్శితులై, యనాథులై
దుర్భగులౌచు కుల్లుపెడి, దుస్థితి గ్రుంగిన భారతీయులన్
నిర్భయతన్, సమాదరణనిల్పి, స్వతంత్రపు భాగ్యమిచ్చి ధీ
నిర్భరుడై వెలుంగు. ఘనునిర్మలు మ్రొక్కెద, గాంధిదేవునిన్!

ఎవ్వాని త్యాగమ్ము లీరేడు భువనాల
కళ్యాణరేఖలై కాంతినిచ్చె
నెవ్వాని బోధమ్ము హీనమౌ వటుదీక్ష
పరతంత్రజాతికి బలమునిచ్చె
నెవ్వానిచేష్ట సమిద్ధమై ధాత్రికి
కర్మయోగమ్మయి ఖ్యాతి దెచ్చె
నెవ్వాని మనుగడ హిమవచ్ఛిఖరమౌచు
సర్వోర్విజనులకు శాంతిగూర్చె
నతడు భరతభాగ్యవిధాత! యవనజేత!
ధర్మనిర్ణేత! శాంతివధవ్రివక్త!
విమలసౌభాగ్యసంధాత! విశ్వనేత!
పూజ్యబాపూజీ స్మరియించి పూతనగుదు,

మోహనుండై ధరమోహింపజేసె, దా
నింద్రియ భోగమోహితుడు గాదు-
కర్మచంద్రుడయి నిష్కామమౌ కర్మ సం
ఘటియించె, కర్మలంపటుడుగాడు
కరుణసాంద్రుండయి కడతేర్చె గోవ వ
హింస కేమాత్రమహితుడుగాడు
సౌగంధ్యగంధియై స్వార్థరహితుడయ్యె
గుణధర్మసుఖవిముఖుండు గాడు

పరులకైనను సమ్మోహ పఱుపగల్గు
వాగ్మి; మితభాష ! నెపు డతిభాషికాడు
ఆర్షధర్మప్రవృత్తి మహాత్ముడైన
ఘనుడు ! గాంధి ! అనాగర జనుడుకాడు !

ప్రేమసామ్రాజ్య ముర్వి స్థాపించె నతడు
సత్యమున్ త్యాగము నియతి చాటె నతడు
ధర్మము నహింస రూపొంద దాల్చెనతడు
అతడు గాంధిమహాత్ముడు ! అల్పజనుడె ?

ఖద్దరు మొద్దుదాల్చి, చరఖావడిద్రిప్పుచు నూలుదీసి, పే
ముద్దులగుల్కు మల్లియల పూర్ణవికాసముబోలు నవ్వులన్
వద్దుగ గ్రుమ్మరించి, హితభాషలువల్కుచు, బోసినోటితో,
హద్దుకురాని పశ్చిముల నంకెకుదెచ్చెను గాంధి మాయురే !

కత్తిని ద్రిప్పలేదు, చరఖావడిద్రిప్పెనెకాని, యెన్నడు
కుత్తుకగోయలేదు, మతికోసెనధర్మము, ఘోరసేన లా
యత్తము సేయలేదు, అసహాయపు టుద్యమమున్ వెలార్చె, నా
వత్తినె ఱుంగుచున్ బ్రిటిషపాలకు లూడని పారిలేగదా !

గ్రుక్కెడు పాలను ద్రావుచు
మక్కువ ఫలరసములాని మాన్యత ఋషియై
నిక్కు బలగర్వముల, కై
పెక్కిన యా బ్రిటిషుదొరల పీచమడంచెన్॥

తనకుం జాలును గోచిపాత తనయౌదార్యమ్ము స్వాతంత్ర్యమున్
ధనమున్ సౌఖ్యమునిచ్చె సోదరుల కాతండే మహాత్ముండనన్
ఘనమౌ వైభవభోగభాగ్యముల దూగంగల్గు వారెందఱో
మనరే ధారుణి ! వారిపేరయిన నేమాత్రంబు నిల్చెన్ ధరన్ ?

భరతాంబ గుండెలో బాకులు గ్రుచ్చుచు
క్షోభింపజేయుట చూడలేక
పరమతాసహనప్రభావంపు ఫలితమౌ
హిందుముస్లింభేద మిష్టపడక
స్వార్థపైశాచిక సంహారనృత్యమ్ము
చెలరేగ నేమియుచేయలేక
అన్యోన్యవైరమ్మనైకమత్యమ్మును
ఆకాశమంటంగ నాపలేక
అక్రమలాభాల, నవినీతి లంచాల
జనమెల్ల దురపిల్ల గనగలేక
తనపదవికొఱకు తనతల్లి నమ్మెడు
ఘాతుకత్వమ్మును గాంచలేక
నీబోధపేరున నిలువుగోతులు తీసి
అన్నదమ్ములజంప నరయలేక
నీకుహారతులెత్తి నీతికిని సమాధి
నిలుపునగట్టంగ నిలుపలేక
మాతృభూమిని విడనాడి మమతద్రుంచి
దివికి వేగితివా ఓయి దివ్యమౌని!
మేమువడుచున్న కష్టాల నేమిచెప్ప!
పయ్యయో, మేమనాథల మైతిమయ్య!

—

## రణసూక్తము

విజయమైనను, వీరస్వర్గమైనను నొకటేయను భావముతో సిద్ధపడి, స్వాతంత్ర్యరక్షణకు ప్రాణార్పణము సేయ ముందడుగు వేసిన వీరనారి; ఝాన్సీలక్ష్మీబాయి, తన సైనిక బృందమునకు ప్రోత్సాహము కల్గించుచు వారి హృదయములలో శౌర్యాగ్నిరగుల్కొలుపగా నామతించిన రణ సూక్తము —

జయ! జయ! త్రిపురహరా! ది
గ్జయ జయ! ఫాలాక్ష! కాలకంధర మృత్యుం
జయ జయనాదమ్ముల, ని
ర్భయమతిజనుడీ. స్వతంత్రరణ దీక్షితులై॥

రండో భారతపుత్రులార! రణవీరశ్రేష్ఠులారా, భుజా
దండస్ఫారధనుర్విముక్తశరసంతానంబు లుప్పొంగగా
ఖండింపన్, మదవైరికంఠము, లసృగ్ధారారుణగ్రీష్మమా
ర్తాండుల్మీరయి, మాతృభూమిని స్వతంత్రజ్యోతి వెల్గింపగా॥

కదలుడీ లయకాలకాలకంఠనిటాల
చటులలోచనశిఖిజ్వాల లగుచు
ఉరుకుడీ మదవారణోత్పాటనక్షుధా
హంకారకుపితసింహమ్ములగుచు
సాగుడీ ప్రళయఝంఝూమరుజ్జృంభిత
పుష్కలావర్తకాంబుదము లగుచు
తరలుడీ దుష్టదైత్యచ్ఛటాకంఠలుం
ఠన తాండవసుదర్శనమ్ములగుచు

దశదిశానాథసంత్రాసదముగ, మహిత
వీరశంఖమ్ములూది, నిర్భీకవృత్తి
శాత్రవుల శోణితంబు వసంత మాడ
బోయి, జయలక్ష్మితోడ విచ్చేయుడయ్య॥

కదనక్షోణి పొలమ్ముగా, నిశితఖడ్గమ్ముల్ హలశ్రేణిగా
మదమత్తారిశిరోధిరక్తఝురులన్, బారించి శౌర్యమ్మె దో
హదముంగా వెలయించినట్టి జయసస్యంబిచ్చు సత్కీర్తి సం
పదలన్ బెంపువహించు మీ మధురనామంబుల్ జగన్మాన్యతన్॥

అరులందోలుచు సంగరాంగణము నందాత్మవనీరక్షకై
మరణమ్మో, విజయేందిరావరణమో, మార్గమ్ముగా సాగుమీ
కరవాలమ్ములవాడి, వేడికథలై కావ్యమ్ములై, లోని, నె
త్తురు పొంగింపగ, వీరహారతుల నెత్తున్ భావిసంతానముల్॥

రణభూమిన్ మరణమ్మనాదృతమె? వీరస్వర్గ సంప్రాప్తికా
రణ! మేలాభయమంద; చావునకు! శౌర్యక్రీడలో ప్రాణముల్
పణముల్ పెట్టెడి దేశరక్షకులు, మీరల్, మీయశోవల్లి కా
రుణపుష్పంబుల తావిలో మునిగి తేలున్ భావిసైన్యంబులున్

రౌద్రరసమిట్లు వీరమూర్తముగనయి
మత్తమాతంగసైంధవ మస్తకముల
కందుకక్రీడ సల్పనో కదనభూమి
ఘన, వధింపుడు; శత్రుసైన్యమ్ము నిపుడు॥

క్షుద్రుల్ కారు, మదీయనందనులు, తేజోదుర్నిరీక్ష్యాక్షులో
రుద్రుల్, శాత్రవగర్వ నిర్దళనధుర్యుల్; శూరులౌనంచు, ని
ర్నిద్రింబౌ, ఒకనమ్మకంబుగల, తల్లిన్, ప్రాణమొక్కెత్తుగా
భద్రమ్మున్ బొనరింపకుండ మదిలో వాల్లభ్యముల్ గూడునే?

పోటరి తనాన, పందిములలో దాటి వచ్చి
మూగి, నట్టింట దీపమార్పుటకు జూచు
తెల్లపురుగుల టెక్కులు తెగించుదనుక
శాంతియును లేదు; లేదు విశ్రాంతి మనకు!

విడ్డూరంబులె! చావుపుట్టువులు! భావింపంగ, నావత్తులో
వడ్డంబై, మనకన్న భూమికిటు. సాయంబింత గావించుటే
దొడ్డానే, పగవాని కిల్లొసగి, వీథుల్వట్టిపోనేల! మీ
బిడ్డల్ పావలు, దాస్యశృంఖలములన్, బిడ్డార్చు టానందమే!

అసిపూని యెదురైన యప్పుడొసంగిన
తల్లి దీవనవేడి తగ్గలేదు
నొసట రక్తాక్షతల్ పొసగించు ప్రియురాలి
యధరమ్ముపై నవ్వులారలేదు
వనుమించు నాతండ్రి యని బిడ్డలేబుగ్గ
పులికిన యుత్సాహ మణగలేదు
తనగౌరవము నిల్పి, నిను పిల్చు దేశమా
తృమనోరథంబులు తీరలేదు
మగటిమి చెలంగ, పగతుర పొగరణంచి
చదలికెత్తుము, స్వాతంత్ర్యజయపతాక
పూర్వవీరయశస్స్వర్ణమూర్తులకును
క్రొత్తమెఱుగులు దీర్పుమీ కత్తి మొనల!!

జయ! జయ! త్రిపురహరా! ది
గ్జయ! జయ! ఫాలాక్ష! కాలకంధర! మృత్యుం
జయ! జయ నాదమ్ముల, ని
ర్భయమతి చనుడీ, స్వతంత్ర రణదీక్షితులై!!

---

# అమ్మ

అమ్మ యను శబ్దము చెవుల గ్రమ్ముకొనగ
హృదయ మానంద జలధియై చదలు ముట్టు
అమ్మ, జీవాళి దన్పెడు నమృతరసము
అమ్మ జగతి జైతన్యరసాయనమ్ము
అమ్మ, సృష్టికాధారమౌ అమలశక్తి
అమ్మ లేక జీవంబెట్టు లవనిబుట్టు!
అమ్మపదమది వీనుల గ్రమ్మినంత
పుడమి యానందమున పొంగి పొరలుననుట
వింతకాదు, కాదిదియు రవ్వంతయేని
అమ్మ! నీనామ మదియెంత హాయినించు!
అమ్మ! నినుమించు దివ్యత్వ మవని గలదె!

తన సంతానము ఘోరపాపవిషపాత్రమ్మై బుసల్ గొట్టనీ
తన కర్తవ్యము వేదశాస్త్రనినుతిన్ ధర్మోద్ధతిం జూపనీ
తన డెందంబది, దివ్యమౌ మమత వాత్సల్యాబ్ధియై పొంగి, నూ
తన జీవంబిడి, బిడ్డనోము! నిలమాతన్ బోలు వారుందురే॥

ధనములం గొనలేని ఘనసౌఖ్యపద మమ్మ
యొడి యందె పుడమిలో నొందగలము!
గ్రంథపాఠమ్మున గనలేని విజ్ఞాన
మమ్మవాక్కులయందె యందగలము
చందమామ లిడని చల్లదన మ్మమ్మ
కడకంటి చూపున బడయగలము
సిద్ధరసమిడని జీవశక్తియు నమ్మ
కౌగిలిం గొల్లగా గాంచ గలము

అమ్మ హృదయవాత్సల్యమహాబ్ధిపొంగి
రహిని చిందించు కరుణామరందబిందు
వొక్కటియె చాలు! చాలు! నీ యుర్వి జనుల
కమృత చైతన్య రససిద్ధి, నమరతనిడ॥

తను వేమాత్రము నొప్పనక్ బడిన సంతానంబు "అమ్మా"యనన్
ఘనమౌ సౌఖ్యముకల్గినన్, జననినే, గా, నోటబేర్కొగనున్
తనివింబొందిన వేళలన్ తలతురాస్థన్ బిడ్డలమ్మన్ బలా!
జననింబిల్వక సాగునే మనుగడల్ సర్వోర్వియందేరికిన్!

పాపాత్ము డౌగాక పావనమౌ అమ్మ
వాత్సల్య మతనికి భద్రకవచ
మత్యంతమవివేకియౌగాక అమ్మ క
టాక్షమ్మె యతనికి రక్షరేఖ
అమిత కురూపియే యౌగాక ఆయమ్మ
కంటి కాతడు సుమ కాంతిరేఖ
కటికదరిద్రుడౌగాక ధరణి నమ్మ
నీడయె యతని పెన్నిధియు భాగ్య
మమితవాత్సల్యరాశియౌ అమ్మప్రేమ
మఖిలశక్తిప్రదాత్రియౌ అమ్మహృదయ
మతులభాగ్యనిధానమౌ అమ్మవిభవ
మరసిస్తుతియింపగా సాధ్య మగునె ఇలను!

'తల్లిచాటుబిడ్డ' ధారుణి నపవాద
మాతృబలముతోడ శోభ గనును
'తల్లిలేని బిడ్డ' ధారుణి ననుకంప
కర్హుడౌను - తెలియు మమ్మ మహిమ!

అమ్మ యే సృష్టిహేతువౌ ఆదిశక్తి
అమ్మయే భువనములేలు ఆమంధాత్రి
అమ్మ యానందపావనాకారమూర్తి
అమ్మను మతింతు కళ్యాణమూర్తిగౌరి!

అమ్మ పితృగాల్వంగ ప్రత్యక్షదైవ
మనె, సతతయోక్త్యలంకార మగునె తలప!
చీము నెత్తురులోడిచి, చివరి. సుతుల
మనుచునమ్మ! తీర్పదరంబె మాతృ ఋణము!

# గదాధరుని విద్యాభ్యాసము

జగమెఱుగక, తన్నెఱుగక
గగనార్పితదృష్టి, గదుఁడు కాలముఁగడపన్
పగలో, సెగలో, తెలియక
బెగడుపడిరి, డెందమందు పితరులు నితరుల్॥

ఇట్టివానిని పరిదిద్దు టెట్టు లనుచు
తడవు తలపోసి, తలిదండ్రు లెడదలందు
నిశ్చయించిరి అయిదేండ్ల నిండగుసుతుని
బడికిఁ బంప, సర్వము చక్కఁబడునటంచు

అక్షరవిద్యార్థుఁడు
అక్షీణప్రాభవాత్ము డఖిలరతజగత్
పక్షుఁడగు నతని కిట్టుల
నక్షరముల గఱపు తలఁపు లచ్చెరువులుగా॥

ఒక శుభోదయమున, సుముహూర్తమందు
మంత్రపూతాగ్ని గొలిపించి, మాన్యగదుని
ఒజ్జలకు నప్పగించిరి బుజ్జగించి
యుపహితునిజేసి యక్షరాభ్యాసదీక్ష॥

గదుఁడు బడికిఁబోవుట యలంకారమయ్యె
భావి, మహిగల సకలమౌ ప్రాణికోటి
దైన్యముం బాప, పుట్టినదైవమూర్తి
గదుని చదివించుటననేమి కారణమ్ము!

అక్షరాభ్యాస మంగళదీక్షనొంది
తోడిబాలుర తనతోడ తోడుకొంచు
తల్లిదండ్రుల దీవెనల్ తలను దాల్చి
అర్భకుడు గదు డాయువరాహ్ణవేళ

చిటిపొటితమ్మిమొగ్గలగు చేతులలో బలపమ్ము, పల్క, ము
చ్చటగయిసేసి; తల్లి సొగసారగ దిద్దిన వేషభూషలన్
పొటిపొటి క్రొన్నడన్ బడికిపోవుచు పోవుచు చూచెమార్గమం
ధటమటలార్చు నెండలకు నాహుతియౌ ముదివగ్గు పాఱునిన్

పప్పులుప్పులతోటి పదివస్తువుల నిండు
 వ్రేగుల, భుజములు వ్రేలుచుండ
ముసలితనమున ముడుతలువడినట్టి
 బడుగు దేహము కడు బడలువడగ
కటకుటెండల నిప్పుకలఁగాలి వ్రేళుల
 పుటములు చురచుర పొక్కుచుండ
తిలకమ్ము చెమ్మట దిగజార ముక్కున
 మొగమెల్ల విట్ప్రూర్పుపొగల ధగుల
తడబడుచు నొక్కయడుగె అమడయుగాగ
మాటికి బుజాల మూటలు మార్చుకొనుచు
అసురుసురులొచు వంధంద యూగియాగి
పోలివడు భూసురుని కాత్మ జాలివడుచు

బ్రహ్మతేజంబు దీపించు ఫాలతలము
ఆర్షవిజ్ఞానరోచి వైలార్చు కనులు
కలుగు నవనీసురుని బాధ దలచి గదుడు
కమ్మగ వచించె, మలయానిలమ్ముపోలె॥

"ఇట్టినిప్పులు చెఱగెడు నెండవేళ;
పగులు పాషాణములుకూడ! బరువుతోడ,
తరుముకొనివచ్చు నీజరాభరముతోడ
ఆగడుగుడిచెదవేటి కోయయ్య"! అనిన

నాయనా నేడు శ్రాద్ధదినమ్ము; ప్రభుని
మందిరమ్మున, శ్రాద్ధసంభారములను
మోసికొని పోవుచుంటి - మామూలె మాకు
నవరకర్మల నవరాహ్ణ మగుట బాబు!

అనిన కారుణ్యమేపార నసె గదుండు
"ఎండ సోకునడస్పి మేసెల్లి, కందె
చెన్నువోనాడి సెమ్మోము చిన్నవోయె
ఇంతవట్టు భుజించిన పొంతగనము!

వయసు మీరిన వాడవు బ్రాహ్మణుండ
వింట గూర్చుండి వరముబోధింపవలయు
సమయమున గూడ నిట్లు భోజనము లేక
ఏల? ముదునలివయ్యు శోషింప నిట్లు?"

అనిన నివ్వైర ముఖము నందలము కొనగ
"బ్రాహ్మణుల బాలుడవు! నీవు పలుకనిట్లు
లక్కజంబయ్యె! సెవ్వార లారగింతు
రెట్లు! శ్రాద్ధంబు ముగియక! ఎఱుగవయ్య!"

వృద్ధవిప్రుండిటుల వచియింప, తోన
చిన్నికందామరలు ద్రిప్పి, పొన్నపూవు
ముక్కుపై వ్రేలు మొనయించి అక్కజమున
పసిగదుం డిట్టు లొయ్యన బదులు పలికె॥

"బ్రాహ్మణోత్తమ నీవల్ల బాగుగాదు
పొట్టకూటికై వడెదవె యిట్టిపాట్లు
వయసు కైవారిలె శ్రమియించు వలనుగాదు
ఆదుకొనువార లొక్కరులైన లేరె?

కోటి విద్యలు నేర్చుట కూటికొఱకె
అనెడు సూక్తి నెఱుగవే మహాత్మ నీవు;
జీవకోటి యాహారము స్వీకరించు
వెరవు ప్రాణ సంరక్షణ కొఱకు గాదె!

అట్టియెడ నీదు ప్రాణము లిట్టు లోగి
రమ్ము గొనుటకె, కడబట్టి రాలిపోవ
విద్య లార్జించి ఫలమేమి విప్రవరుడ
భారతీయవిజ్ఞానమ్ము సారమిదియె?

బ్రహ్మతేజమ్ము వెల్గొందు వదనముగన
ప్రణతు లర్పింప నిజముసూ మనసుపుట్టు
జానబొట్టకై తిప్పలు జాలి గొలుపు
ఇంతలోనసె దిరుగునె ఇంత బ్రతుకు!

మిమ్ముబోంట్లె యీ యగచాట్లు మీరకున్న
అన్యు లెవ్వరు బరమార్థమరయ గలరు!
ఇప్పిరో మానవుల జన్మమింత నీచ
మ్మగునె" అనుచు నింకేమేమొ యాతఁడు, వచి
యింపబోవంగ కన్గవకెంపులదర
రోషవివశుడై పాఱుండు 'రొప్పి, రోజి
ముకుపుటమ్ము లుబ్బియు కడు మోహరింప
బ్రాహ్మణత్వ మవమతిని బడెనటంచు
బాలునింగనికుఁద్ధుడై పలికె నిట్లు॥

అరరే డింభక ! యెట్టెటూ వలికె దౌరౌరా! ననున్ సత్పరా
వరవిద్యావరసిద్ధు, నిద్ధమతి, నంబాభక్తు నుద్యద్వయో
గురు, నీ తీరున వల్క పాడియగునే, కుందేటిలేగూన కే
వరితో, కోరి సరాగమాడుటయె! ఛాచ్ఛా కాలదౌష్ట్యమ్ములున్॥

అనుచు నేమేమె బిట్టుగ నఱచువాని
పిచ్చిపాఱుండు లెమ్మంచుపేక్షఁజూని
ముద్దుపెదవుల చిఱునవ్వు మొగ్గదొడుగ
తనకు దానయి యోచించుకొనియె గదుడు॥

"ఎంతటి వివేకి యయ్యును
శాంతమ్మున క్రోధరిపుని చక్కడగలే
డింతలు రంతులు సేసెడి
నాంతర్య మెఱుంగ డీ ధరామరు డౌరా॥

ఇంతకు వారి వీరి వననేల యహో యిహలోక వృత్తమే
యింత యగుంగదా యనెడు నేవము భావమునం జిగుర్ప, నా
వంతగు పొట్టకూటికొఱకా! కొఱమాలిన కోటివిద్యలున్
ఇంతకు నారువోయు వరమేశ్వరుడేమఱి నీరువోయుడే

ఇంతమాత్రపు దానికి నింత చదువు
లేల! సాములే"లని జగల్లిల దెలిసి
ఒడికి స్వస్తి జెప్పి యతడు వెడలె మగిడి
గదుని చదువిట్లు ముగిసెను గడియలోనె॥

గేహముజేరి గదుం డే
యూహము లేకయె వరగతి నెప్పటి యట్లే
యూహము సేయుచునుండ, న
వోహమునన్ జడుడని తలవోసిరి జనముల్॥

భక్తియొ, బాధయో, తెలివిబాసిన యజ్ఞుల రీతియో, మతే
శక్తియొ కాక, కామినులశక్తియొ, యేర్పడ దాసెటుంగకే
ముక్తుని లీల భాసిలుచు మోదము జెందెను మోక్షభామినీ
రక్తిని నాత్మలోమునిగి రచ్చకు కారణమై వెలుంగుచున్॥

కన్నులుండుగాని కానదులోకమ్ము
వీనులుండికూడ వినదు నుంత
మనసు మాత్రమేమి మాయల తఱుగదే
ఇంతచేటుపుట్టి నిడియెకతము॥

గదుని యాత్మవృత్తి కతము నెఱుంగకే
పెఱ్ఱి వాడటంచు వివిధగతుల
లోకమాడిపోయు లోపెల్లుగనలేక
భరతధాత్రినిదియు పాపమనక॥

జనులు తన్ను వెఱ్ఱిజడ్డ యటంచును
వింతకథలనల్లి వేయిచెప్ప
తథ్య మాత్మయందు తానె తిరంబొచు
గదుడు బాల్యమిట్లు గడుపుచుండె

కల్లజగముచూచి కలగని బాలుని
కలగి జగము వింతకరణి దలచె
చిట్టి పొట్టిగదుడు శ్రీరామకృష్ణుడై
ఘనత జెందుటెట్లు జనత దెలియు ?

## గదుని క్రీడాభిలాష

ఆడుచు పాడుచు న్సఖులు హ్లాదము నొందుచు తోడివారలన్
వేడుక పిల్చుచున్ గదుని వేగరె రమ్మని పిల్వ బాలురన్
గూడుచు పోయిపోయి యాట కోర్కెలు దీరగ క్రీడసల్పి పై
దోడుల నేమరించియు గదుండెపా మారము చేరె చింతతోన్

ఆడుకొందమనుచు తోడి వారలు పిల్వ
వేడ్కగదుర గదుడు వెడలె కాని
క్రీడలందు మనసు గీల్కొనదతనికి
గవ్వమీది పైడి మువ్వపోలె॥

పాలితదివ్యభావు, పరిపాలితభక్తివినము నా గదున్
కీలితపుణ్యకర్మపరికీర్తినెవో కడువింతభావముల్
పాలనసేసి లోగొనగ భావము దక్కి నిమేషమాత్రలో
మీలితనేత్రుడై మునిగె మేకొను భక్తిసమాధిభావమున్॥

అతని యెడంద పాల్కడలి యందలలట్లు వసంతమాలతీ
లత, విరిమొగ్గలట్లుగ తలంపులు గుంపులు ముంపులైన నే
కతమున జేరి తన్మధురకల్పన జేర్చు సుఖమ్ముతో, నిమీ
లితనయనాబ్జుడై సవదరించు, సమాధి; మునీంద్ర లభ్యమున్.

భావసమాధిని గాంచెన్
భావుకు డప్రాకృతుండు బాలుడు దివ్య
ద్వైవతమూర్తుల, జనకసు
తావల్లభముఖుల నద్భుతంబావహిలన్.

పంచశరత్ప్రాయుఁడహో
కొంచెపు జదువైన లేని కోమలబాలుం
డంచిత భావసమాధి, ను
దంచిత మూర్తులను గాంచె దైవాకృతులన్॥

ఆ చిఱుత వయసు వానికి
నే చదువు తెఱుంగనట్టి యిద్ధాత్మునకున్
తోచెను సమాధిలోన, న
యాచితముగ వివిధదైవతాకృతులగతుల్।

అమ్మహనీయమూర్తు లెదురైనను, తొల్కరిగన్న చక్రవా
కమ్మునుబోలె. జాబిలిని గాంచు చకోరములీల పొంగు చి
త్తమ్మున, చెక్కుటద్దముల ధారలు గట్టగ, మోదబాష్పముల్
జిమ్మిన, నాత్మలో గదుడవాచ్యకళాభినివిష్టభావుడై.

అట్టులుగాంచి మోమున ముదశ్రులు వావిరిగ్రమ్మ పుల్కలున్
తెట్టునతేర బాలుడురుతేజమునన్ గను లల్ల విచ్చి, యా
పెట్టునలేచి భూరజము బ్రీతిగ చేతులజేర్చి మెల్లగా
తట్టుచు నాత్మభాసిలెడు దైవతమూర్తుల సుందరంబుగాన్

తనలోన దిరుగుమూర్తుల
గనుచును మృత్తికను మలచె, కమ్మని కోర్కల్
మునుకొన, లోపల వెలుపల
గనుగాని యొకతీరుగాగ గదుడుప్పొంగెన్

## శారదాదేవి యౌవన విలాపము

పొంగులు వారు జవ్వనపు పొందికలందపు మేనికిన్ జగా
రంగులు గూర్చికొ్రమ్మిసిమి రంజిలజేయ వియోగబాధకున్
లొంగి యధీరయైతనకు లొంగని చిత్తముతోడ స్వామికిన్
జెంగటజేరు భావనలచేడియ బొ్రద్దులు పుచ్చునిచ్చలున్॥

భర్తృగత భావనావేశ భరితయగుచు
విస్మృతాన్యప్రపంచయై వెలది మిన్న
వెన్చనూర్చును దనలోన విహ్వలించు
వలవరించును శారద కలవరించు॥

పరమహంసుని భావనాసరసి దేలి
పరమహంసియె తానయ్యె బాలయపుడు
నిత్యముక్తుని సంస్మృతి న్నియతి దవిలి
అన్యచింతనాముక్తయై యతివనెగడె॥

భవవిరక్తుని నామజపమ్ము జేసి
భవముఖాసక్తి భాసిల్లు వడతి మిన్న
అగు విధివిధాన మతిగూఢ మద్భుతమ్ము
బాలచరితమె రచియించు భావిచరిత॥

అబల శారద సంప్రాప్త యౌవన యయి
భర్తృసన్నిధిగోరుచు వలపుబారి
బడి, వహింపగ లేక తా బాళిదూల
దశమిపర్వ మేతెంచె హృత్పర్వమగుచు

మాతమహేశ్వరి మహిషాసురుం గూల్చి
జగతికానందమున్ సలుపుదినము
రావణాధము ద్రుంచి రాముడు ధర్మమ్ము
మహిని నిల్పినయట్టి మహిత దినము
శమినుండి విజయుండు శస్త్రాశిగై కొని
కౌరవవిజయమున్ గనిన దినము
పృధ్వీపతులు శత్రునృపమండలినిగెల్వ
విజయయాత్రలుసల్పు విహితదినము
సర్వజనసమ్మతంబగు పర్వదినము
కూతులల్లుండ్ర కోర్కెల గూర్చుదినము
శౌర్యదీప్తి బాలురకు నుత్సాహదినము
జగతి నరుదెంచె దశమి పండుగదినమ్ము

దసరాపండుగ వచ్చిన
వెసవెస జామాతలెల్ల విందులుగుడువన్
శ్వశుర గృహమ్ములు సేరిరి
అసదృశుడగు నల్లపరమహంసయెదక్కన్॥

చెక్కిట చేతిని జేరిచి
మక్కువ నిజనాధురూపు మనసున గనుచున్
మిక్కిలి మురిసెడు శారద
గ్రక్కున చెలికత్తెలెల్ల గదిసిరి వేడ్కన్॥

ఏమమ్మా నీ పెనిమిటి
కేమమ్మా ఇంతనిటు! ఎంతటివాడో
ఏమనుచు నెంచినాడో
భామా నీవిభుడురాడు పండుగకైనన్॥

కామినీ చూచితే 'లలిత' కాంతునిగూడి సుఖించు పండుగన్
కోమలి గాంచుమా 'గిరిజ' కూర్మిధవున్ సరసోక్తులాడుటల్
భామిని చూడవే 'భ్రమర' భర్తను తోడనె తెచ్చె నింతకున్
శ్యామ, యిదేమె నీసుఖము! చాలును! నాథుడురాక పండుగే!

అరరే యెంతటి చోద్యమమ్మ యిటులెందైనన్ గనంగల్గునే
కలవో మానిని లోకమందు, పతులే కళ్యాణులన్ బొందరో
అరుదౌ నీదుకతల్వినన్వినగ, నయ్యారే మహామోహముల్
బరువుంజేతువె నీదు జీవితము నేబ్రాసిన్ పతిన్ గొల్చుచున్

మగడు తన్నేలకయె యింత మనసుదవిలె
అతడు తనవాడెయైన నొయ్యారినీమె
బట్టగా శక్యమగునటే? పలుకదేమి?
చిత్రమని రవాళించుచు చెలులుజనిరి

తనమగడు వెడగంచును దడవి తడవి
చెలులు గేలిసేసిన నంత తెలిసి తెలిసి
తనబ్రదుకె భారమౌటయు తలచి తలచి
బాల మనమున శోకించె పనవి పనవి

సంసృతిబంధముల్ చయ్యన గోసెడు
ధీరమతికి దాను దెబ్బయట్టె!
దేవదేవునిదెల్పు దివ్యమనీషియౌ
ప్రాజ్ఞమతికి దాను భార్యయట్టె!
అఖిలాత్మ సంస్మరణానందమునదేలు
ధన్యజీవికి దాను దన్వియట్టె!
భక్తసంతతిబ్రోవ పరమహంసుండైన
మహితాత్మునకు దాను మగువయట్టె!

తనయునికి యెంతొ, తానెంతొ తలపుగొనక
చెలులు కేరడమాడిన చెదరి, బెదరి
"తాను సామాన్యపతివోలె దైన్యమంద
తగదు" అనియేమొ శారదధైర్యమంది

తనమగడు పిచ్చివాడని
పనిగొని లోకమ్ము తన్ను పలుచనసేయన్
వినుచు నమాయిక యాసతి
విపవట్టుల బొద్దుపుచ్చు విహ్వలమతితోన్

వరులమాట లింత పాటిసేయ దగునె
ఇంత కసలు నాథు డెట్టివాడొ
అనెడి యూహ మొలచి మనసున తహతహ
పుట్టె ప్రాణవిభుని పట్టుజేర॥

ఏవిధి కోరిక దీరును?
నా విభుకడకంపుడనుచు నాన విడచినే
నేవగ బితరులనడుగుదు?
నా విధి యెట్టుల లిఖించె నది తెలియదుపో

కన్నుల కఱవుం దీరగ
నెన్నడు వీక్షింతునాథు, హృదయేశ్వరునిన్
మన్నవ జీవితకుసుమము
పన్నితతత్పాదయుగళసన్నిధి నిడుదున్.

పితరులజేరి యెట్టిదొ యభీష్టము దెల్పెడి పల్కుపల్కుచు
న్నతుల నొవర్చుచు న్గరుణ నాథుని జేర్పరె నన్నటంచు వే
వితముల వారి పాదముల వేడుచు కన్నుల నీరునించుచున్
మతిగరగించి వారికడమాటను బొందెను నెట్టకేలకున్

[illegible]

[illegible]

[illegible]

[illegible]



# భావదేవస్తుతి.

సంసారసాగరతరంగనిపీడితాహం
క్రోధాదిరాక్షసబలాతివికర్శితాత్మా
దుఃఖైశ్చతైర్హినితరాంచ విముహ్యమానా
సంప్రార్థయే సుదృఢ మీశ తవాంఘ్రియుగ్మం
రక్తారవిందసుకోమల కాంతిపుంజం
భక్తాళివాంఛితసురద్రుమ మాత్మవేద్యం
ధృత్వామునీశ్వరమనస్స్మరణీయ మాద్యం
దేహీతి శాంతి మమలాం, కృపయా విభోమే
భావాధినాయక మమైవహిత్వం శరణ్యం.

# లజ్జాకిరీటధారిణి

లజ్జా కిరీటధారిణీ, సజ్జితవేషహారిణీ
కజ్జలరేఖాలంకృతదృగంచలనిమజ్జిత
సర్వధారుణీ, శోభన కారిణీ, పాపహారిణీ
కళ్యాణవైభవమణి, ర్జయ నవ వధూమణి.

హర్షాధికదీర్ఘాయతనయనోత్పలభాసినీ
ప్రేమాధికవిజృంభితసుమనోంచితహాసినీ
అత్మేశ్వరమృదుస్పర్శామధురభావ లాసినీ
ఆనందాధికపులకాంచితతనువిభాసినీ

దీప్తోజ్జ్వలకాంతిమత్కళ్యాణతిలకమోదినీ
శుభ్రోన్నతప్రేమభావపులకితాంగరాగిణీ
వ్రీడాంచితమృదులహాసరక్తనేత్ర శోభినీ
స్త్రీభావుకతాహారమణి ర్జయతు వధూమణిః॥

# దుర్గా సంప్రార్థనము

[ చైనా దురాక్రమణ సమయమున వ్రాసినవి ]

ప్రళయసమానభీకరుల పాశవభోగపరాయణాత్ములన్
కలకలలాడు లోకముల గారియవెట్టిన దుష్టభావులన్
అలమహిషాసురారి హతమార్చిన, లోకశుభంకరీ, యిటీ
తులువల చైనదుండగుల దున్మవ దేమిటి కర్మ మమ్మరో

శుంభనిశుంభులన్ జదిమి శోభనమౌ స్థితి యేర్పడన్ శుభా
రంభము సేసినట్టి, శివురాణివి, శక్తివి, లోకమాతవీ
దంభులనెట్లు సైచితివి తల్లిరో, చైనుల, దుష్పరాక్రమా
రంభుల, శాంతి విద్విషుల, రాక్షసధర్ముల, మిత్రఘాతులన్॥

విమలాచారులు, ధర్మవిక్రములు, సంవిచ్ఛోభితాత్మాకృతుల్
మమతాదూరులు, పారమార్థికసుధీమాన్యు ల్ప్రశాంతిప్రియుల్
రమణీయాత్ములు, భారతీయులకు మిత్రద్రోహులౌ చైనులన్
సమరోద్రేకుల నుక్కడంపగ సముత్సాహమ్ము పాటింపవే

ఏటికో యీ దురాక్రమణ! మేటి కధర్మపురాజ్యకాంక్షలు!
ఏటికి మిత్రవంచనము! లేటికి సంధివిరుద్ధచేష్టలున్!
ఏటికి శాంతివిద్విషత! యేటికి మానవసభ్యతేతరా
ర్భాటము! లీయనార్యులను పాటుకు దెచ్చుటదెట్లు తల్లిరో,

## దివ్యదర్శనము

నిముసము కన్ను లేమరిన, నీ మహితాద్భుతమూర్తి దర్శన
ప్రమదమహానుభూతి కెడబా టది వాటిలునో యటంచు చి
త్తము కడు తత్తరంపడెడుతల్లి! త్వదేక సమస్తభావనా
సమధికవృత్తినై పరవశత్వము జెందెద కన్యకాంబికా॥

ఒకపరి మందహాసమధురోచ్ఛలితాధరరేఖ సాగి, వే
రొకపరి సత్కృపారససముజ్జ్వలలోచనరోచి రేగి, యిం
కొకపరి సుప్రసన్నము, విధూపమానసశోభ దోగి, అ
ప్రకటితభావనాఝురి, భవత్ప్రియమూర్తి చుట్టి వచ్చెడిన్॥

కనులు పసిండిచెందొవలుగా కురియించు కృపామరందవా
హినులను ముగ్ధిలేలుచు భ్రమించెడు, నన్ను జగత్త్రయాశ్రితా
వనశుభదీక్షితాభయభవన్మృదుహస్తము సేద దేర్చున
ట్లనుపమితానుభూతి యొక డల్లుకొను న్నిఖిలాంతరంగమున్॥

తల్లీ! ఏమిది! నీయపూర్వకరుణాతాత్పర్యముల్ మన్మనః
కల్లోలంబడుగంట, కంటిని జగత్కళ్యాణశోభానుపం
ఫుల్లశ్రీభవదీయరూపవిభవంబున్, మత్పురాపుణ్యమున్
త్వల్లీలాశుభకీర్తిమాన్యము పవిత్రస్థాన మిచ్చోటునన్

# ఆంధ్రనాయక రత్నము

బ్రహ్మరుద్రులకైన భయపడబోవని
బ్రహ్మణ్య ధీరు గోపాలకృష్ణు
మవజాతి, మనదేశ, మహిత సంస్కృతినిల్ప
వలుపాట్లువడిన గోపాలకృష్ణు
బ్రిటిషుసింహము సటల్, దిటవు నిలువుగా బెరికిన
స్వాతంత్ర్యయోధు గోపాలకృష్ణు
చీరాల పేరాల సీమలఖ్యాతి దే
శాల నిలిపిన గోపాలకృష్ణు
భారతీయుల దాస్యబంధమ్ము బావంగ
స్వార్థమ్మువిడిన గోపాలకృష్ణు
రామదండున మాతృభూమి సేవించిన
భవ్యనాయకుని గోపాలకృష్ణు
భావబంధుర రసమూర్తి, భవ్యకీర్తి
హాస్యకవిచక్రవర్తిని, ననఘు, ధీరు
నద్వితీయవక్త, వలఘు, నార్ద్రహృదయు
నాంధ్రనాయకరత్నమ్మునంజలింతు॥



## కంచికామకోటి పీఠాధిపతి

ధర్మసంస్థాపనార్థము యుగయుగముల
సంభవించెడి మహేశ్వరుడ వీవు
ఆర్త జనమ్ముల యార్తిని బాపంగ
అభయహస్తమునెత్తు ననఘు డీవు
ఘోరదుష్కలికాల భారమ్ము నావంగ
సాక్షాత్కరించిన స్వామివీవు
దర్శనార్థిభవమ్ము తరియింప జేయంగ
పూర్ణమూర్తిని గొన్న పురుషుడీవు
దీనుల సముద్ధరింపగా దివ్యశక్తి
గరుణ రూపెత్తి వచ్చిన ఘనుడవీవు
కామకోటిపీఠాధీశ! కామజేత,
చంద్రశేఖరేంద్ర, శ్రీశ, స్వామి! నతులు!

నీవ యిచ్చిన వాక్కును నిలువరించి
స్తోత్రముంజేసి నీ కృప స్తుతచరిత్ర!
ధన్యనైతిని నీనాడు ధరణిబుట్టి
చేదుకొనుమయ్య పరమేశ సిద్ధభావ!

ఎది జనించునో యుష్మదభీష్టగరిమ
ఎది భవత్కృప వలన సమిద్ధమగునో
అట్టి కారుణ్య వర్షమ్ము నమర జిలికి
ఆదరింపవె భగవాన్! జోహారు నీకు

[illegible]

[illegible]
[illegible]

[illegible]
[illegible]
[illegible]
సకలమానవమనస్సదనములను
[illegible] ధల్
క్రైస్తవాఖిలమతధర్మసీమలందు
ప్రసరించె నీతత్త్వ[illegible]ందిత్యవక్త్రికల్
బుధజగన్నుతకావ్యపుష్పములను.
వశదిగంతపరివ్యాప్త విశదకీర్తి!
చంద్రికాచారుశీతలస్వచ్ఛమూర్తి!
ప్రథితభారతసంస్కృతిజ్ఞానగణ్య!
పుణ్యశీల! రాధాకృష్ణబుధవరేణ్య॥

**భారతమాతృపంచితతపఃఫల, మున్నతనైగమాంతవి**
**ద్యారుచిరార్ద్రరత్నఖని, హైందవకీర్తిపతాక, పాండితీ**
**భారవినమ్రహైమగిరి, వాగ్గుణిరమణీయకల్పనా**
**స్ఫారనవీనశిల్పము, శుభాకృతి రాష్ట్రపతిన్నుతించెదన్॥**

**గంగాభంగతరంగపావనజగత్కల్యాణవాగ్వైఖరుల్**
**నింగిన్నిల్వగ పుణ్యభారతపురంధ్రీ శ్రీకిపుత్రుండవై**
**పొంగారించితి కీర్తిచంద్రికల సొంపుల్ దేశదేశాల నీ**
**కంగిన్ సర్వజనార్చితుల్ సుకృతులెవ్వారోయి విద్వన్మణీ॥**

జగతికి ప్రామాణికుడై
న, గురుండధ్యాత్మవిదుఁ డనావిలశీల
ద్విగుణితయశోవిశాలుం
డగణితధిషణామహాత్ము నాతఁడు వొల్చున్

గాయకసార్వభౌమ, మహావాగ్గేయకారరత్న
## శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణగారి
## అభినందనము.

రవలు పలికించు కంఠమార్దవమునీది
ఒడలు పులకింపగాజేయు నాదుపునీది
విమలగాంధర్వమీరీతి విశ్రుతినంద
దాను నీరూపున దనువు దాల్చెనయ్య
రాగ రాగిణులన్నియు సాగి సాగి
గానఝరి యౌచు నీ మృదుగళమువెడలి
జగతి శుచ్యవగాహమ్ము సలిపెనయ్య
బాలమురళి! నీవొక్కడె చాలు! చాలు;
గాన భారతికి వసుధ రాణగూర్ప
ఆంధ్రభారతి నిమగని యాంధ్రియయ్యె
గీతభారతి నినుగని కీర్తిగనియె
సకలసుకళావిదుండవు శాస్త్రరతివి
గానసౌందర్యమాధుర్యజ్ఞానమూర్తి!
నీదు గళమాశ్రయించి ప్రమోదమంది
గాన భారతి నిజమిటుగాణయయ్యె

## "పరిమితమౌ జవాభా భారతమాతకు కూర్చుశోభ"

( ఒంగోలు కవిసమ్మేళనము )

సుందరభారతోర్వి యిది శూన్యగృహమ్మయి శోభఁదక్కునో
ఇందిరకాలవాలమగు నిల్లిది పెద్దమ యాశ్రయించునో
ఎందఱొ పాలపాపలకు తృప్తిగ క్షీరములే లభింపవో
మందియె హెచ్చు పల్చనగు మజ్జిగయు న్లభియింప వోచమో

గంపెడురాలను గైకొని
ఇంపుగ మురియుటయు మేలె యిక్కాలమునన్
సొంపగు ప్రజ మొకటియే
పెంపును పేర్మిని దెలుపదె? విభవము గాదే॥

ధీరులు శూరులౌ ప్రజలు దేశసమున్నతి చాటువారలౌ
వారికి నర్హమౌ గతి నవారిగ కూడిడు దారి లేక యా
హారసమస్యతో ప్రభుత హాస్యముపాలగుచుండె నక్కటా
సారవిహీనమౌ అధికసంతతి, తగ్గ సమస్య తీరదే॥

మందుల మాకులం గొనక మానసనిగ్రహశక్తిచేత, నెం
దెందరో, మున్ను పూర్వులును, దేశము, సుస్థితి నుండు గోర్కె, నే
సందియమొందకే అధికసంతతి, వారణసేసి, వార లా
నందము నొంది, రా స్థితి, యనాదృతమే యిపుడైన గాంచుడీ॥

వచ్చితి నొక్క వాస్తవము, పాఠకులం గని విన్నవింపగా
హెచ్చుజనాభ యోగ్య మని, యే వచియింపగబోను, కాని బల్
హెచ్చుగ నావరేషను లహీనముగా నొనరింపగా జమల్
పిచ్చటిలంగబోరె? కడు భీకరమౌ స్థితి, సంభవింపదే॥

వదిరూకల్గొన చిత్తమాపవడి యే భారమ్ములన్, బాధ్యతల్
మదినిం గైకొన కానుపత్రులకు సామంతంబుగా నేగుచున్
ముదితల్ ఠీవిగ నావరేషనుల, బల్మోజున్ గొనంగా,సరా!
ఇది, దేశమ్మునకే వినాశనమును గల్గించున్ గదా చూడరే॥

పరిమితమౌ జనాభ, మన భారతమాతకు గూర్చుశోభ, యే
తిరుగును లేని సత్య మది, దీనికైన ప్రణాళికాగతిన్
పరిమితి యుంచగా దగు, నపారజనమ్ముల మేలుకూర్ప, నే
కొఱతలు గల్గకుండునటు, కోవిదు లారసి చూడగావలెన్॥

[ రేడియో సరసవినోదిని సమస్యాపూరణము ]

## పరాక్రమించి మించువారు భారతీయ సైనికుల్

పురాప్రసిద్ధముల్‌గదా అమోఘ భారతీయధీ
పరాక్రమంపు చేష్టితా లనక్రవీరగాథలున్
పురే. యెటుల్ భ్రమించినారొ, బుద్ధియున్ చలించెనో
బిరాన దూరి జోరుగా, వివేకహీనతన్ వనాం
తరాంతరంబునందునన్ ముదాన ప్రవేశించు కే
సరిన్ సటల్ కరంబులాగ సంభ్రమింతురే ప్రపం
చరాజ్యనీతినిన్ కడున్ హుషారుతోడ వీటబు
త్తురే, అఖండశాంతియత్నదోహలమ్ములౌ వసుం
ధరాసమాఖ్యసాధనన్ వితల్ పొనర్ప జూతురే
కిరాతచర్యతోడ మాటికిన్ కవించి మించుచున్
దురాక్రమంబు సేయ కాలుదువ్వ దుండగీండ్రు, ఈ
పరాయి శత్రుసేనపైన భారతీయులున్ గమిం
చరే సమస్త వీరలోక సాహసుల్, సెబాసనన్
పరుల్ తిరోగతిన్ పలాయనంబు చిత్తగింపగా
పురోగమించి శత్రుశీర్ష మూచకోత కోయరే
పరాకులేని దీక్షతోడ భారతీయవాహినుల్
తిరంబుగాగ నిల్చి మాతృదేశరక్ష సేయ జా
గరూకతన్ వహింపవే, అఖండశౌర్యదీప్తితో
విరాట్స్వరూపులై అరిప్రవీరభీకరమ్ముగా
కరాళభైరవోద్ధతి న్నఖర్వగర్వరేఖతో
పరాక్రమించి మించువారు భారతీయసైనికుల్॥

---

# కవయిత్రి మొల్ల

[ కవయిత్రి మొల్లగా పెక్కు భువనవిజయ సభలలో
పాల్గొన్నపుడు, చెప్పిన పద్యములు కొన్ని ]

[ విజయవాడ భ్రమరాంబా మల్లికేశ్వర గ్రంథాలయ రజతోత్సవ
మున నిర్వహింపబడిన సరస్వతీ సామ్రాజ్యోత్సవములలో
మొల్లపాత్ర నిర్వహించినపుడు చదువబడినవి ]

సమస్య

వనుని సూను డాకలిని, బాపుకొనంగ నుపాయ మేది యం
చు వనమునంతటన్, గలయ జూచి, నభమ్మున కాంతిపుంజమౌ
సవితను పండుగా తలచి చయ్యన నెద్దియి నభమ్ము క్రమ్మగా
రవి యుదయించినంతనె ధరాస్థలి గ్రమ్మెను, కారుచీకటుల్॥

దత్తపది

శంక తొలంగి లక్ష్మణుని స్వాస్థ్యము కోరుచు నీ నిమేషమే
లంకను వీడి ద్రోణమచలాంకము జేరియు జీవనౌషధిన్
వంకకు తెమ్ము తమ్మునకు ప్రాణము లిమ్ము, నిశావిభుండు మున్
గ్రుంకక ముం దటంచు వడి కోరెను రాఘవు డంజనాసుతున్

# కవయిత్రి మొల్ల

[ పరిధావి సంక్రాన్తి పర్వమున భావపురి కళాభారతివారి
భువనవిజయసభలో ]

కృష్ణరాయ ప్రశంస :

సంగీత సాహిత్య సరసకళాలక్ష్మి
కాలియందెలు ఘలుఘల్లు మనగ
చటులార్భటీనటత్పటుశౌర్యఘనలక్ష్మి
పూర్ణవిక్రమమున పొంగియడర,
ఆంధ్రవాఙ్మయధుర్య అష్టదిగ్గజముల
లలితాంధ్రసాహితీలహరి పర్వ
అన్యదేశాగతులగు రాయబారు లాం
ధ్రుల వైభవశ్రీల నభినుతింప
ఆంధ్రసామ్రాజ్యలక్ష్మికి నఖిలదిశల
ప్రాభవోన్నతి సెలగంగ ప్రభుత నెఱపి
తెలుగుదీప్తి వెలయుకృష్ణ దేవరాయ!
అమరసంస్తుత్యచరిత! నీ కంజలింతు॥

సమస్యాపూరణము :

ఘోరాకారుల, క్రూరరాక్షసుల, బల్ ఘోరంబుగాదున్మి, స
త్సారంబౌ, వరధర్మమార్గమును ప్రస్థాపింపగాబూని, తా
వీరావేశముచెంది యచ్యుతుడు శ్రీ విష్ణుండె, యీ ధారుణిన్
స్ఫారాకారత దేవకీసుతుడుగా జన్మంబునందంగ నా
కారాగారమునన్, ధ్వనించెనవురా! గాంధర్వ సంగీతముల్

మొల్ల కవితారీతి:—

ధర్మవిగ్రహం శ్రీరామధరణిపాలు
దివ్యచరితము వేనోళ్ళ తెలుగుజాతి
కీర్తనము సేసి తరియించు స్ఫూర్తికొఱకు
సాధ్విసీతమ్మత్యాగసంస్మరణచేసి
తెలుగువజ ధర్మనిరతిని మెలగు కొఱకు
మహిని మానవకౌటుంబమహితవిధుల
తీరుతెన్నులు రూపొందు దీప్తి కొఱకు,
నెంతబలమున్న చలమది యెంతయున్న
శీలరహితులు, దుష్టులు తూలిపడెద
రనెడి సత్య మాచంద్రతారకముగాగ
స్థాపితమ్మయి యాంధ్రులు చక్కనైన
రాజమార్గాన నడచి విరాజిలుటకు
తేనెసోక నోళులు తియ్యనౌనటులను
కమ్మనౌ తెల్గునను రామ గాథ పాడి
భవము నీగితి మొల్లను భయముదొఱగి

(వర్ధమానసమితి
ఒంగోలు 31–3–76
వల ఉగాది భువనవిజయ సభ)

## మొల్ల

అష్టదిగ్గజముల నాస్థానమందుంచి
ఆంధ్రభారతికి సమర్చ్చచేసె
విద్యానగరలక్ష్మి విభవదర్పణమన
ఆంధ్రశిల్పము పేర్చి అవఘళించె
దేశభాషలయందు తెలుగులెస్సనివల్కి
ఘనకిరీటము నిచ్చి గౌరవించె
దుష్టశక్తుల బెక్కు దురముల దునుమాడి
తెలుగుశౌర్యమునకు దీప్తి దెచ్చె
తెలుగువిభుడను నేనని పలికి, తెలుగు
తల్లికి నలంకృతినిగూర్చి ధన్యుడయ్యె
రాజమాత్రుడె శ్రీకృష్ణరాయవిభుడు
సరససాహిత్యసమరాంక ! చక్రవర్తి !
తెలుగుతల్లి ముద్దులబిడ్డ! దివ్యకీర్తి !

సమస్యా పూరణము :

తమ తమ సౌఖ్యముల్ మరగి ధర్మముతప్పుచు పాలితప్రజల్,
క్రమమునుదప్పి పాలకులు, కంచెయె చేనినిమేసినట్లు తా
మె మసలుచుండగాఁ అది సహింపక ఇందిర పూనెగాడె యు
క్తములను నిర్వదిన్! ప్రజల దైన్యము దుఃఖమువాసె నయ్యరే
అమవసనాటి వెన్నెలలు హామది నించునుగాదె సౌఖ్యముల్॥

# కవయిత్రి రంగాజమ్మ

[ పొన్నూరు భావనారాయణస్వామివారి ఆలయమున 12-6-67వ తేదీ నాడు జరిగిన 'సరస్వతీ సాక్షాత్కారము'ను మహాసభలో రంగాజిగా వ్యవహరించినపుడు ]

భావనారాయణస్వామి స్తోత్రము :

వందేహం పరయాభక్త్యా రాజ్యలక్ష్మీమనోహరం
భవతాపవిఘ్నం మనఘం భావనారాయణం హరిం॥

రఘునాథ నాయక ప్రశంస :

శ్రీయుతులైన, సత్కవివరేణ్యులకోటికి నాయకుండవై
పాయక శ్రీహరింగొలుచు భక్తులకెల్లను నాయకుండవై
మాయని శౌర్యదీప్తిమహిమల్గల వీరుల నాయకుండవై
నాయకుడైన నీ కొలువు నాణెముగా రఘునాథ నాయకా॥

వ్యష్టి సమస్య :

ఎలుకలు, పిల్లులు, కుక్కలు
కలభంబులు, సింహశరభఘాతుకమృగముల్
భళిరా! కణ్వాశ్రమమున
పులులావులు గలసిమెలసి పొలమున దిరిగెన్

## ఇంతుల శౌర్యరసేష్టి

(అంతర్జాతీయ మహిళా సంవత్సర సదస్సులలో చదివినది)

రుద్రమ్మ దిద్దిన రుధిరాక్షరపు పంక్తి
కాలవాహిని లోన కఱగిపోయె
చాందుబీ త్రిప్పిన చండఖడ్గపుధార
త్రుప్పుపట్టుచు తునాతునక లయ్యె
రాణి యహల్యాబౌ రమ్యపాలనమ్మును
ధారుణిం దలచెడు వారు లేరు
సంగమ్మ మలచిన ఘనయుద్ధపాండితి
మధురవీధులలోనె విధురమయ్యె
జీజిబా గుడిపిన చేవలు దిద్దెడు
వీర్యంపుటుగుబాలు విఱిగిపోయె
మాంచాలయిడినట్టి మగువఖడ్గము నేడు
మొక్కవోయియు పెనుముక్క లయ్యె
తల్లి వాసవియొక్క త్యాగవైభవ మిల
పొల్లుపోవుచు నెంతొ పల్లవడియె
చానమ్మ నెఱపిన సాహసవృత్తమ్ము
మట్టిలో పొర్లాడి మాగువడియె
కణ్ణగిసౌశీల్య ఘనశక్తి తీవ్రత
మెత్తమెత్తగనౌచు ఱిత్తవడియె
కస్తూరి యిడిన రక్తతిలకమందున
పూతివాసన యెంతొ పులుముకొనియె
కవి సరోజనిదైన ఘనదేశభక్తిలో
రమ్యగుణస్ఫూర్తి రాలిపోయె

ఇంద జింతుల శౌర్యరసేష్టి నేము
భరతమహిళల నావేశపఱచెనేని
మాతృభారతి దుఃఖమ్ము మాయు! నిజము!
ప్రజలదైన్యమ్ము వాయుట నిజము! నిజము!

మాతృశ్రీ ప్రింటర్సు స్టేషన్‌రోడ్, బాపట్ల - 522 101